## మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన నూతన కలెక్టర్ హరీష్


మంత్రిని కలిసిన కలెక్టర్

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరీష్ శుక్రవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసున్నారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్ ను అభినందించారు. ప్రజాజ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకొని వెళ్లాలని సూచించారు.




## ఎదురెదురుగా బైకులు ఢీ కొని న్యాయవాది మృతి...ఇద్దరికి తీవ్ర గాయాలు

**పెద్దేముల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ నుంచి తాండూరుకు వస్తున్న గ్లామర్ టిఎస్ 34 ఏ 4824 బైక్‌పై కోడంగల్ మండలం పర్సాపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ క్రిష్ణయ్య(30)తో పాటు మరో వ్యక్తి వస్తుండగా, మంబాపూర్ గ్రామానికి చెందిన ఆకుల ఇంతియాజ్, హన్మగల్ల అశోక్ తాండూరు నుంచి మంబాపూర్‌కు ఏపి 28,జి 0633 హీరొహోండాపై వస్తుండగా మంబాపూర్ శివారులోని పీనుగుల వాడుక వద్ద ఢీ కొన్నాయి. గ్లామర్‌పై వస్తున్న అడ్వకేట్ క్రిష్ణయ్య తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆటోలో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు క్రిష్ణయ్య అనే న్యాయవాది వికారాబాద్ కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. మంబాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయలయ్యాయి. వీరిద్దరిని కూడా తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్థంబించి వాహనాలు నిలిచిపోయాయి.

## ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

### - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించిన శ్రీవర్ధన్‌రెడ్డి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గంలో భారీ స్థాయిలో పరిశ్రమలు ఉన్నాయని, అందులో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, అలాంటి వారికి ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేస్తే బాగుంటుందని బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జ్ శ్రీవర్ధ‌ర్‌రెడ్డి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కలుసుకొని సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... 1976లో అప్పటి సీఎం జలగం వెంగళరావు షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండల కేంద్రాన్ని పారిశ్రామిక ప్రాంతంగా గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, అప్పటి నుంచి ఇక్కడ ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరిగిందని అందులో వేలాది మంది కార్మికులు పనులు చేస్తున్నారని అన్నారు. కార్మికుల కోసం ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడం చాలా బాధకరమైన విషయమని, ఇకనైనా ఈ సమస్యకు పరిష్కారం చూపించి కార్మికులకు న్యాయం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించానని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకోవడం పూర్తిగా విఫలమయ్యాయని, ఇక్కడ ఉపాధి పొందుతున్న కార్మికులకు సరైన వైద్య సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నార ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల సంక్షేమం నిమిత్తం వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఈ సమస్యపై సంబంధిత కార్మిక శాఖ కేంద్రమంత్రికి సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన నారాయణ్ రెడ్డి శుక్రవారం నగరంలోని శ్రీనగర్ కాలనీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను విద్యాశాఖ మంత్రి అభినందించారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కలిశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలి

**ఆమనగల్లు, ఫిబ్రవరి02, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్ళు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం పథకం ప్రవేశపెట్టి ఏళ్ళు గడుస్తున్నా ప్రభుత్వం నేటికి ఆమనగల్లు మున్సిపాలిటీలో ఒక్క ఇళ్లు కట్టలేకపోయిందని ఆయన విమర్శించారు. ఇళ్ళు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు ఉన్న పేదలకు రూ. 3లక్షల ఆర్థిక సహాయం పథకం వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది. ధర్నాకు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ జ్యోతికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పథకాల అమలులో హామీలకే పరిమితమై ఆచరణలో వెనుకబడిపోయిందని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ళ పథకం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా బిఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఏఒక్క మండలంలో ఇళ్లు నిర్మించలేకపోయిందని విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. అర్హులందరికి ఇళ్ళు, నిర్మాణ ఆర్థిక సహాయం అందించకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దుబ్బ చెన్నయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. శివశంకర్, సిఐటియు మండల కన్వీనర్ లాలునాయక్, మున్సిపాలిటీ రంగం జిల్లా నాయకురాలు హంసమ్మ, మండల అధ్యక్షులు రవి, పద్మ, విజయ, యాదమ్మ, లక్ష్మమ్మ, మైసమ్మ, చిన్న, చిట్టిబాబు, జంగయ్య, కుమార్, శ్రీను, గోపాల్, నరసమ్మ, యాదయ్య, కృష్ణ, సాలమ్మ, భారతమ్మ తదితరులు ఉన్నారు.


ఆమనగల్లు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**కీసర, ఫిబ్రవరి3, ప్రభాతవార్తః** తెలంగాణలోనే సుప్రసిద్ధమైన శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్ బందోబస్తు ఏరాట్లపై శుక్రవారం కీసరగుట్టలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వలన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ భక్తులకు ఈ సారి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. మహిళా భక్తులు, పిల్లలు, వృద్దుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్స్‌ను కూడా అందుబాటులోకి ఉంచనున్నట్లు తెలియజేశారు. భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్దతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

భక్తులు పోలీసు వారికి సహకరించాలని, సంతోషంగా భగవంతుని దర్శనం చేసుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి జానకి, వెంకట్‌రెడ్డి, కుషాయిగూడ ఏసిపి, ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ, సిఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐలు రమేష్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ రమేష్‌శర్మతో మాట్లాడుతున్న పోలీస్ కమీషనర్ చౌహాన్

## మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అమోయ్‌కుమార్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3, ప్రభాతవార్త** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నూతన కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా నియమితులైన అమోయ్‌కుమార్ శుక్రవారం ఉదయం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని నూతన జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేయటంతో కలెక్టరేట్ వద్ద జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆంఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వర్లు నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి వారు ఘనంగ స్వాగతం పలికారు. నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇన్‌చార్జి కలెక్టర్‌గా పనిచేసిన హరీశ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్‌కుమార్ మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై విచ్చేయటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు కలెక్టర్ల బదిలీలు జరిగాయి. అయితే మేడ్చల్ జిల్లాకు నూతన కలెక్టర్‌గ విచ్చేసిన అమోయ్‌కుమార్ సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వర్లు, పలువురు జిల్లా అధికారులు పాల్గొని జిల్లా నూతన కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఆ తరువాత జిల్లాకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు నూతన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగ కలిశారు. జిల్లా కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ అమోయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరిం చటంతో కలెక్టరేట్‌లో సందడి కనిపించింది.


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించిన మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్ ఆమోయ్‌కుమార్, పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, పలువురు జిల్లా అధికారులు

## రెండవ విడత గొర్రెలు పంపిణీ చేయాలి

**యాచారం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత గొర్రెల పంపిణీని చేపట్టి గొల్ల, కురుమలను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిప్యూటీ తహసీలార్దకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేష్, ఉపాధ్యక్షులు అచ్చన్న రమేష్, సహాయ కార్యదర్శి బర్ల మల్లేష్, మండల నాయకులు మైసయ్య, సత్యనారాయణ, నక్క మహేందర్, బైకని పాండు తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### - తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

### - యాలాల శివ స్వాముల కేసులో 6మంది రిమాండ్

**తాండూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ హెచ్చరించారు. గత నెల 30న యాలాల మండలం దేవనూర్ గ్రామంలో జరిగిన రెండు వర్గాల ఘర్షనలో పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ ముమ్మరం చేశారు. ఈక్రమంలో ఘర్షనకు కారకులైన 5మంది శివ స్వాములతో పాటు ఘర్షనను ప్రోత్సహించారని గుర్తించిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఇందకు సంబంధించి డీఎస్పీ శేఖర్‌గౌడ్ మీడియాకు వివరాలను వెల్లడించారు. గత నెల 30వ తేదీ రాత్రి యాలాల మండలంలోని దేవనూర్ గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గానికి చెందిన యువకుల మద్య ఘర్షన చోటుచేసుకుందని, 31న బొడ్కె నరేందర్ యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే, ఫిర్యాదు చేసి 12గంటల గడవక ముందే కొంతమంది అమాయకులైన శివస్వాములను ప్రేరేపించి మండల పరిధిలోని లక్ష్మినారాయణపూర్ చౌరస్తాలో ధర్నా చేయడం జరిగిందని పేర్కొన్నారు. ధర్నా మద్దతుగా వచ్చిన జిల్లా మాజీ గ్రంథాల చైర్మన్ మురళీకృష్ణగౌడ్ దేవనూర్ గ్రామానికి చెందిన యువకులను రెచ్చగొట్టి యాలాల పోలీస్టేషన్‌కు వస్తున్న మెట్ల నరేష్‌పై దాడిచేయించారని వివరించారు. యాలాల పోలీస్టేషన్‌కు వచ్చి తలదాచుకుంటున్న నరేష్‌పై దాడిచేయడంతో పాటు పోలీస్టేషన్‌లోని రికార్డురూమ్ తలుపులు బద్దలుకోట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని వివరించారు. పోలీస్‌స్టేషన్‌పై దాడికి పాల్పడినట్లు గుర్తించిన శివ స్వాములు బొడ్కె నరేందర్, నరేందర్‌గౌడ్, అరవింద్‌గౌడ్, శివకుమార్, గణేష్‌లు శుక్రవారం మురళీకృష్ణగడ్ ఇంటివద్ద ఉండగా వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. వారిని విచారించగా ఈ సంఘటనకు పూర్తిగా మురళీకృష్ణగౌడ్ బాధ్యుడని తెలుపడంతో ఆయనను కూడ అదుపులోకి తీసుకొని తాండూరు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్ నిమిత్తం పరిగి జైలుకు తరలించడం జరిగిందని వెల్లడించారు. ఈ కేసులో కొంతమంది వ్యక్తులు తమ స్వలాభం కోసం కులాలు, మతాల మద్య విద్వేషాలు రగిల్చి గొడవలు సృష్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని డీఎస్పీ శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులతో గ్రామస్తులు, ప్రజలు, యువకులు జాగ్రత్తగా ఉంటాలని సూచించారు. అనవసరమైన వ్యక్తుల మాటలకు రెచ్చిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ఎవరైనా కులాల మద్య చిచ్చురేపి శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు

### కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశాలకు రాజకీయ పార్టీలను భాగస్వాములను చేయండి

**కీసర, ఫిబ్రవరి3, ప్రభాతవార్తః** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సమీక్షా సమావేశాలకు రాజకీయ పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాలలో ప్రజాప్రతినిధులను. రాజకీయ పార్టీలను సమీక్షా సమావేశాలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్కుతందాన్నారు. కానీ రాష్ట్ర కార్మిఖ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి వచ్చినప్పటి నుండి కేవలం అధికారులతో సమీక్షలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జాతరలో ప్రజాప్రతినిధులను, రాజకీయ పార్టీలను, యువజన సంఘాలను ప్రాతినిత్యం వహిస్తే తప్పు ఏముందన్నారు. అందరిని భాగస్వామ్యం చేస్తే జాతర అద్భుతంగా జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్రహ్మత్సవాల సమీక్షా సమావేశాలకు అందరిని పిలవాలని ఆయన కోరారు.

## 5న పొన్నాల్‌లో గండి శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మ అమ్మవార్ల జాతర

### -జాతరకు, భక్తుల రాకకు ఏర్పాట్లు సిద్ధం


పొన్నాల్ సమీపంలోని గండి చిత్తారమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల ఆలయం జాతర సందర్భంగ ముస్తాబు అయిన దృశ్యం


జాతర సందర్భంగ ఆలయంలో కొలువు ధీరిన శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మ అమ్మవార్ల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** పొన్నాల్ గండి శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మ జాతర 5న ఆదివారం జరుగనున్నందున ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న పొన్నాల్ గండి శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మల జాతరను ఘనంగ నిర్వహించటానికి, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనటానికి ఏర్పాట్లు చేశారు. ప్రతిఏటా కూడ శ్రీగండి చిత్తారమ్మ, పెద్దమ్మల జాతర జరుగుతున్న సంగతి తెలిసిందే. కోరిన కోర్కెలు తీర్చే చిత్తారమ్మ, పెద్దమ్మల అమ్మవార్లుగా ప్రజల నుంచి, భక్తుల నుంచి వినపడుతుంది. ప్రతి ఏటా కూడ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలోనే విచ్చేసి అమ్మవార్లను ధర్శించుకుని పూజలు చేయటం జరుగుతుంది. ఆదివారం జరిగే జాతరలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. జాతర సందర్భంగ ఆదివారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారి పటం కార్యక్రమం, అగ్నిగుండాలు త్రొక్కుట, సాయంత్రం ఫలహారం బండ్లు తిరగటం, ఆ తరువాత బోనాల ఊరేగింపు కార్యక్రమం జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6న కొండపోచమ్మ అమ్మవారికి పూజలు, బోనాలు ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పటకర్ (ఖత్రి) గడ్డి రాజు ఆలయ వ్యవస్థాపకులు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మల జాతరను ఘనంగ నిర్వహించటానికి పొన్నాల్ గ్రామ సర్పంచు బి. సుకన్యసత్యనారాయణగౌడ్, ఉపసర్పంచు గడ్డం రమేశ్, ఎంపిటిసి మౌనికప్రసాద్, పలువురు వార్డుసభ్యులు, మాజీ సర్పంచు కె. శంకర్, గ్రామ పెద్దలు కృషి చేస్తున్నారు. జాతర సందర్భంగ భక్తుల రాకకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరలో పాల్గొనటానికి మంత్రికి, జడ్పీచైర్మన్‌కు, ఎంపిపికి, జడ్పీటిసికి పలు పార్టీల నాయకులను కూడ జాతరకు ఆహ్వానించటం జరిగిందని ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపాల్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని కోరటం జరిగిందని, భక్తులు కూడ భారీ సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోవాలని వారు కోరారు.

**..జాతర సందర్భంగ ఉచితంగ నీటి సరఫరా : ఉపసర్పంచు గడ్డం రమేశ్**

పొన్నాల్ గండి చిత్తారమ్మ, పెద్దమ్మల జాతర సందర్భంగ ఉచితంగ నీటిని సరఫరా (ట్యాంకర్ల ద్వారా) అందిస్తున్నట్లు పొన్నాల్ గ్రామ ఉపసర్పంచు గడ్డం రమేశ్ తెలిపారు. శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామంలో జరిగే ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోవాలని ఉపసర్పంచు గడ్డం రమేశ్ కోరారు.

## ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలు వినియోగించుకోవాలి

**-సివిల్ కేసులు పీఎస్‌లో పరిధిలో ఉండవు : సీపీ చౌహాన్**
**-ప్రశాంతత, ప్రజల భద్రతే ప్రభుత్వ విజన్**
**-పోలీసులపై ప్రజలకు నమ్మకం కలగాలి**



ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల వివరాలు తెలుసుకుంటున్న రాచకొండ సీపీ డిఎస్. చౌహాన్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** పోలీసు వ్యవస్థపై ప్రజలు ఏలాంటి అపోహలు లేకుండా అన్యాయం జరిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్‌కమీషనర్ డిఎస్. చౌహాన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రాచకొండ సీపీగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా ఘట్‌కేసర్ పీఎస్‌కు విచ్చేసిన సీపీకి ఎస్‌హెచ్ఓ వి. అశోక్‌రెడ్డి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు రౌడీషీటర్ల పోటోలు చూసిన సీపీ వారి ప్రవర్తనపై ఆరా తీశారు. లాకప్, నేరాల విభాగం, ఎస్ఐల క్యాబిన్లు, వివిధ కేసుల ఫైళ్లను సీపీ పరిశీలించారు. పీఎస్ ఆవరణలోని కమాండ్‌కంట్రోల్‌ను సెంటర్‌ను సందర్శించి పలు విభాగాలను చూసి నిర్వహణను తెలుసుకున్నారు. స్టేషన్‌లో విభాగాలు, రికార్డుల నిర్వహణను తనిఖీ చేసిన సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ, ఎస్ఐలు, సిబ్బందికి సీపీ పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. సివిల్ కేసులు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండవని శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తుంటారని పేర్కొన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు వస్తే నిర్భయంగా పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఏలాంటి అపోహాలు పెట్టుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రశాంతత, ప్రజల భద్రతకు ప్రభుత్వం విజన్‌తో పనిచేస్తుందని, స్థానిక పోలీసు అధికారులు ప్రజలకు బ్లూకోర్ట్స్, సెక్టార్ ఎస్ఐ, డయల్ 100లకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని సీపీ సూచించారు. మల్కాజ్‌గిరి డీసీపీ డి. జానకీ, ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, డిఐ ఈ. జంగయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రకాష్, అడ్మిన్ ఎస్ఐ బి. నాగార్జునరెడ్డి, ఎస్ఐలు ధనంజయ, ఎం. విజయకృష్ణమూర్తి, జ్ఞానేందర్‌రెడ్డి, రాముునాయక్, శివకృష్ణ, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ చౌహాన్

## పేదల పక్షపాతి బిఆర్ఎస్ ప్రభుత్వం



ఎల్‌ఓసి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు, ఫిబ్రవరి3, ప్రభాతవార్త:**
పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు దేశవ్యాప్తంగా కీర్తించబడుతున్నాయని, పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన హాజీర బేగం అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి ఆర్జి పెట్టుకుంది. దీంతో ప్రభుత్వం వెంటనే ఆమెకు ఎల్‌ఓసి రూ. 2.50లక్షలు మంజూరు చేసింది. దీంతో శుక్రవారం హాజీర బేగం భర్త సత్తార్‌కు స్థానిక బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్ సమక్షంలో ఎల్‌ఓసిని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధగా పనిచేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికి సిఎం రిలీఫ్‌ఫండ్‌ను అందిస్తామని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. కార్యక్రమంలో మహ్మద్ అక్బర్, హనీఫ్, అప్సర్, లాలయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

## విశ్వమానవాళికి శాంతి చేకూరాలి

**-సేయింట్ ఫ్రాన్సిస్ శౌరి చర్చిలో కార్డినల్ ఆంతోనీ**

**-శతాధిక వృద్ధుడు బాల్ రెడ్డిని సన్మానించిన పీఠాధిపతి**



చెగూరు రెడ్డి కాలనీలో చర్చిలో శతాధిక వృద్ధుని సన్మానిస్తున్న అగ్రపీఠాధిపతి ఆంతోనీ

**నందిగామ ఫిబ్రవరి3,ప్రభాతవార్త :**
ఆధ్యాత్మికతతోనే ధర్మ మార్గమని,ప్రపంచ శాంతి కోసం భగవంతుని ప్రార్థించాలని హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని అన్నారు.శుక్రవారం నందిగామ మండలం చేగూరు రెడ్డి కాలనీలో పునీత సెయింట్ ఫ్రాన్సిస్ శౌరి చర్చి 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై దైవ జనులను దీవించి మాట్లాడారు..ఎసుక్రీస్తు మానవ రూపంలో వచ్చిన దేవుడని,సమస్త జీవకోటికి రక్షకుడని, ఆయనను సేవిస్తే పునీతులవుతారని అన్నారు.అనంతరం రెడ్డి కాలనీకి పునాది వేసిన శతాధిక వృద్ధుడు,సలిబండ బాల్ రెడ్డిని అగ్రపీఠాధిపతి ఆంతోని,మతగురువులు శాలువాతో సన్మానించారు.ఈ వేడుకలకు ఉమ్మడి తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని భక్తులు హాజరై ప్రార్థనలో పాల్గొన్నారు.ఆశేష భక్తజనావాళితో చర్చి ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ వేడుకలో ఆలయ విచారణ గురువులు సైమన్ రెడ్డి,పాతీమాపూర్ ఐటిఐ డైరెక్టర్ లూర్థుమరెడ్డి,మాజీ జడ్పివైస్ చైర్మన్ ఎన్.నవీన్ రెడ్డి,మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్,బిఆర్ఎస్ నాయకుడు బుగ్గ సాలయ్య,చేగూరు సింగిల్ విండో డైరెక్టర్ వ్రరెడ్డి, అనిల్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,చిన్నపురెడ్డి,అగస్టిక్‌రెడ్డి,చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు,అధికారులు,తదితరులు ఉన్నారు.

## గ్రామస్థాయి కార్యకర్తలు కీలకం



నూతన కమిటి అధ్యక్షుడికి నియామకపు పత్రాన్ని అందజేస్తున్న కుర్మయ్య

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 03,(ప్రభాతవార్త):**
ఏ పార్టీకైన గ్రామస్థాయి కార్యకర్తలు ఎంతో కీలకంగ ఉంటారని బిజెపి జిల్లెడు చౌదరిగూడ మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పీర్జాపూర్ గ్రామంలో బిజెపి బూత్ కమిటీని ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. బూత్ కమిటి అధ్యక్షుడిగా శీలం అశోక్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వార అమలు అవుతున్న పథకాలను బిజెపి నాయకులు ప్రజలకు వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పథకాన్ని అర్హులైన వారందరికి అందించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేబుతున్న మాయ మాటలు ప్రజలకు వివరించి చైతన్య పరచాలని పెర్కోన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చే విదంగ ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిరుపతి, శ్రీరామ్, సంగమేష్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి కాలజ్ఞానం మహిమాన్వితం..

**-విగ్రహప్రతిష్ఠ వేడుకల్లో వీర్లపల్లి శంకర్**

**నందిగామ ఫిబ్రవరి3,ప్రభాతవార్త :** కలియుగ అవతార పురుషుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం అత్యంత మహిమాన్వితమైందని,ఆ మహానీయుని బోధనలు సమస్త మానవ జీవకోటికి ఆచరణీయమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి షాద్‌నగర్ కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ అన్నారు.శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో నూతనంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాప్రతిష్ట,ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు.ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ,చంద్రాపాల్ రెడ్డి,దేపల్లే కుమార్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు సి.నర్సింలు,బోమ్మగళ్ల నర్సింహ్మా,సీతారాములు,యూత్ కాంగ్రెస్ నాయకులు అందేమోహన్,చేగూరు శ్రీశైలం,రాయికల్ శ్రీనివాస్, నవీన్,విశ్వబ్రాహ్మణ సంఘం వడ్ల శంకరయ్య చారి,విష్ణుమూర్తి,కమ్మరి అంజయ్య,వడ్ల రమేష్,డాక్టరు ఆచారి,కమ్మరి ముత్తాలు ,విశ్వబ్రాహ్మణ సంఘం భక్త బృందం,కాంగ్రెస్, బిఆర్ఎస్,బిజెపి, ఎంఎస్‌పి,టిడిపి, వామపక్ష పార్టీల నాయకులు,ఆయా శాఖల అధికారులు,తదితరులు భక్తులు,పాల్గొన్నారు.



నందిగామలోని బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న వీర్లపల్లి శంకర్

## కంటి వెలుగుతో పేదల కళ్ళలో కాంతులు : ఎంపిపి అనితవిజయ్

**ఆమనగల్లు, ఫిబ్రవరి03, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం పేదలకు వరంలా మారిందని ఆమనగల్లు ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్‌లు కొనియాడారు. ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ వైద్య ఆరోగ్య రంగాలను ఎన్నడూ లేనంతగా బలోపేతం చేస్తున్నారని ఎంపిపి, జడ్పిటీసిలు ఆనందం వ్యక్తం చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామంలో శుక్రవారం రెండవ విడత కంటి వెలుగు పథకంను గ్రామ సర్పంచ్ అంబర్‌సింగ్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య బృందం మండల వైద్యాధికారి పరీక్షిత్ హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో నిపుణులు నవీన్ శిబిరానికి హాజరైన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా రీడింగ్ అద్దాలు, మందులు అందజేశారు. ఈసందర్భంగా ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్ మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భారం లేకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణి చేయడంతో పేదల ఇళ్ళలో ఆనందం వెల్లి విరుస్తుందన్నారు. కంటి వెలుగు పథకం దేశంలోని అనేక రాష్ట్రాలు కొనియాడుతున్నాయని, ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనలు పేదల బాగు



మేడిగడ్డలో కంటి వెలుగును ప్రారంభంలో పాల్గొన్న ఎంపిపి అనిత, జడ్పిటీసి అనురాధపత్యానాయక్, సర్పంచ్ అంబర్‌సింగ్

కోసమే ఉంటాయని ఎంపిపి అనిత కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పథకంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సి ఎస్టి మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, ఉపసర్పంచ్ మల్లేశ్, ఏఎంసి డైరెక్టర్ రమేశ్‌నాయక్, కార్యదర్శి ఇందిరా తదితరులు ఉన్నారు.

## ముస్లింల ఖబ్రస్తాన్‌కు రెండు ఎకరాలు కేటాయింపు



ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లో ముస్లీంల ఖబ్రస్తాన్‌కు ప్రభుత్వభూమిని కమీషనర్ వేమనరెడ్డికి అప్పగిస్తున్న నాయబ్ తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి

**-మున్సిపల్‌కు అప్పగించిన రెవెన్యూ అధికారులు**

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లో ముస్లీంల ఖబ్రస్తాన్‌కు రెవెన్యూ అధికారులు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సర్వేనంబర్ 152లోని ప్రభుత్వభూమిలో రెండు ఎకరాలు ముస్లీంలకు ఖబ్రస్తాన్ ఏర్పాటుకు కేటాయిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు మున్సిపల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, గిర్దావర్ అలేఖ్య, సర్వేయర్ జగదీష్‌లు మున్సిపల్ కమీషనర్ వేమనరెడ్డికి స్థలాన్ని అప్పగిస్తూ పత్రాన్ని అందజేశారు. ముస్లీం ఖబ్రస్తాన్‌కు స్థలం కేటాయించడం పట్ల ప్రజాప్రతినిధులు, మైనారిటీ నాయకులు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాసుగౌడ్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌అజీజ్, ప్రధానకార్యదర్శి షేక్‌నబీ, నాయకులు బర్ల హరిశంకర్, మాజీ వార్డుసభ్యులు ఎండి.రహిముద్దిన్, మైనారిటీ నాయకులు కుతుబుద్దిన్, అబ్దుల్‌ఖయ్యూమ్, ఫారూఖ్, ఎంఏ.రహమాన్, ఫయిమ్, ఆయూబ్‌ఖాన్, షాషా తదితరులు పాల్గొన్నారు.

## కేశ్వాపూర్ గ్రామానికి విద్యుత్ స్తంభాలు,వీధి దీపాల ఏర్పాటు

**నక్క ప్రభాకర్‌గౌడ్ సేవా కార్యక్రమాలు అభినందనీయం : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**
కేశ్వాపూర్ గ్రామానికి స్వంత నిధులు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ దూరం పాటు విద్యుత్ స్థంభాలు, వీధీ దీపాలు సేవా భావంతో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ అందజేయటం అభినందనీయమని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు తెలిపారు. గ్రామాల అభివృద్దికి సేవా భావంతో పనిచేసే నాయకునిగా, ప్రజల్లో ఉండే నాయకునిగా రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ కృషి అభినందనీయని ఆయన అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ నక్క ప్రభాకర్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో ఆయన పుట్టిన రోజు సందర్భంగ ఆత్మీయుల నుంచి ఆశీస్సులను అందుకున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల, మున్సిపాల్టీల నుంచి పార్టీ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పాల్గొని నక్క ప్రభాకర్‌గౌడ్ రాజకీయంగ, ప్రజల్లో ఉండే నాయకునిగా మంచి గుర్తింపు పొందారని సేవాభావంతో వివిధ గ్రామాలతో పాటు కేశ్వాపూర్ గ్రామాభివృద్దికి స్వంత నిధులతో విద్యుత్ స్థంభాలు, వీది దీపాలు ఏర్పాటు చేయటం ప్రశంసనీయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్దికి, సమస్యల పరిష్కారానికి ప్రజల్లో ఉండి సేవలు అందించటానికి ప్రాధాన్యత ఇస్తానని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు, ఆదరిస్తున్న ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఆయన దన్యవాదాలు తెలియజేశారు. ప్రజల్లో ఉండే నాయకునిగా మరో సారి వ్యవసాయ క్షేత్రంలో పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేశారు. మరో సారి బిఆర్ఎస్ నాయకులతో బొమ్మరాసిపేట్ గ్రామ పరిసర ప్రాంతం అంత కూడ గులాబిమయంగ మారింది. దీనిలో బొమ్మరాసిపేట్ గ్రామ సర్పంచు ఎం.గీతమహేందర్, ఉపసర్పంచు సుజాతరవికిరణ్‌రెడ్డి, గ్రామ నాయకులతో పాటు వివిధ మండలాల,మున్సిపాల్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.



బొమ్మరాసిపేట్‌లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌ను అభినందించిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, పాల్గొన్న తదితరులు

## మురహరిపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి విరాళంగా భూమి



మురహరిపల్లిలో గ్రామపంచాయతీ భవనం కోసం విరాళంగ ఇచ్చిన భూమిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణంకోసం భూమి పూజ చేసిన దాత తిలకం ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచు ధార భాస్కర్, ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, తదితరులు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**
మురహరిపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం భూమిని విరాళంగ అందజేయటంతో భవన నిర్మాణంకు భూమి పూజ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని మురహరిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణంకు వంద గజాల భూమిని విరాళంగ ఇవ్వటంతో భూమి పూజ చేశారు. అయితే 20ఏళ్ల క్రితం తిలకం గోపాల్ ( ఇండియా వాలీబాల్ టీమ్ మాజీ కెప్టెన్) 650గజాల భూమిని ఇవ్వటం జరిగిందని, అందులోనే అంగన్‌వాడి కేంద్రం పనిచేస్తుందన్నారు. మళ్లీ ఆయన కుమారుడు తలికం ప్రవీణ్‌కుమార్ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం వంద గజాల భూమిని విరాళంగ ఇవ్వటం జరిగిందని గ్రామ సర్పంచు ధార భాస్కర్ తెలిపారు. దీనికి దాత తిలకం ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచు దార భాస్కర్, ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, ఉపసర్పంచు జైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు భూపాల్‌రెడ్డి, బిక్షపతి, కంసమ్మ, మహేశ్వరి, తులసమ్మ, గోపాల్‌చారి, నర్సింహ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ రంతు భాష, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### నేటి నుంచి శ్రీగండభేరుండ లక్ష్మీనర్సింహస్వామి జాతర

**నర్సాపూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలపరిధిలోని లింగాపూర్‌లో ఈనెల 4 నుండి 8వ తేదీవరకు ఐదురోజులపాటు శ్రీగండబేరుండ లక్ష్మీ నర్సింహస్వామి జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఉప్పలపు అశోక్, ఎంపిటిసీ శ్రీనివాస్‌గుప్త తెలిపారు. 4న స్వామి పల్లకిసేవలో గుట్ట పైకి వేంచేయుట, 5న శ్రీలక్ష్మీనర్సింహస్వామి కళ్యాణం, తీర్థ ప్రసాద వితరణ, 6న సత్యనారాయణ వ్రతాలు, మొక్కులు తీర్చుట, గుమ్మడమ్మ ఆలయం వద్ద అగ్నిగుండాలు, బండ్లు తిరుగుట, రాత్రి అంజమ్మ చరిత్ర భాగవతం, 7న పాచిబండ్లు తిరుగుట, ఒగ్గుకథ తీర్థప్రసాద వితరణ, 8న గుట్ట పైనుండి స్వామివారు పల్లకిలో గ్రామంలోకి తిరిగి వచ్చుటవంటి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు వెంకటయ్య, లక్ష్మినర్సయ్య, సాలె నర్సింలు, దండునారాయణ, కంజర్ల ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు

### నమ్మదగిన విద్యుత్‌ను అందించడంలో సహాయం

నాగారం ఫిబ్రవరి 3,ప్రభాతవార్త : ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న హైదరాబాద్ సంస్థ ఆజాద్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ న్యూక్లియర్ టర్బైన్లకు కీలకమైన రొటేటింగ్ భాగాలను సరఫరా చేసే తొలి సంస్థగా నిలిచింది.ఈ కీలక భాగాల తొలి సెట్‌ను డెలివరీ చేశారు.వాటిని ఫ్రాన్స్ దేశంలోని బెల్‌ఫోర్ట్‌లో తయారు చేసే న్యూక్లియర్ టర్బైన్స్‌లో అసెంబుల్ చేస్తారు.ఇందుకోసం ఆజాద్ సంస్థ న్యూక్లియర్ టర్బైన్స్ విడి భాగాలను సరఫరా చేసేందుకు జీఈ స్టీమ్ పవర్ కంపెనీతో దీర్ఘకాల ఒప్పందం కుదుర్చుకుంది.ఇది ఈ సంస్థకు చాలా పెద్ద అవకాశం దేవానికి కూడా గర్వకారణం..జీఈ స్టీమ్ పవర్ విద్యుత్ ప్లాంట్ల కోసం సాంకేతికతలు,సేవలతో కూడిన విస్తృత పోర్ట్‌ఫోలియోని అందిస్తుంది.తద్వారా వినియోగదారులు భవిష్యత్తులో తక్కువ కార్బన్ విడుదల చేసే విభాగాలకు మారినప్పుడు నమ్మదగిన విద్యుత్తును అందించడలో సహాయపడుతుంది.ఈ సందర్భంగా ఆజాద్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేశ్ చోప్దార్ మాట్లాడుతూ...మా పంచవర్ష ప్రణాళిక వైపు మమ్మల్ని మరింత ముందుకు నడిపిస్తుందని మేము నమ్ముతున్నామని అన్నారు.

## పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి

**-స్థలం ఉన్న వారికి రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించాలి**

**-ప్రజాసంఘాల పోరాట వేదిక ధర్నా**



ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయం ముందు ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు యాదయ్య, సబిత

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
ప్రభుత్వం నిరుపేదలకు 120 గజాల స్థలం కేటాయించి రూ.5 లక్షలతో ఇళ్ల నిర్మాణం చేయించాలని సీఐటియూ జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఎన్.సబితలు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయం ముందు శుక్రవారం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 120 గజాల స్థలాన్ని కేటాయించి రూ.5 లక్షలతో ఇళ్లను నిర్మించాలని యాదయ్య డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎంతోమంది ధరఖాస్తు చేసుకున్నా ఇళ్లు కేటాయించలేదని తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు పక్కా గృహాలను కేటాయించాలని, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల సమస్యలపై ఈనెల 9న ఛలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టామని పేదలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వభూముల్లో పేదలకు స్థలాలు కేటాయించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు జి.నాగమణి, కార్యదర్శి సిహెచ్.అరుణ, ఉపాధ్యక్షురాలు కె.అలివేల, ఎన్‌పిఆర్‌డి మండల కార్యదర్శి చంద్రమోహన్, సునీత, అనసూర్య, శ్రీకాంత్, రత్నమ్మ, స్వప్న, ఫర్జానా, బాలమణి, జమీల తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం 5 గంటల పాటు కరెంట్ సరఫరా ఉండదని ఏఇ సతీష్‌కుమార్ తెలిపారు. ఘట్‌కేసర్ 33/11 కేవీ ఉపకేంద్రంలో వార్షిక నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ను తొలగిస్తునా న్నమని చెప్పారు. ఘట్‌కేసర్ పట్టణంతో పాటు శివారెడ్డిగూడ, మారుతీనగర్, మైసమ్మగుట్ట, యంనంపేట్, బాలాజీనగర్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, ఘణాపూర్ పరిసర కాలనీలు, కంపెనీలకు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ కోరారు.

**స్థిరమైన కార్యకలాపాలను బలోపేతం చేయడమే లక్ష్యం**

శామీర్‌పేట ఫిబ్రవరి3,ప్రభాతవార్త : ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో,హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఫిబ్రవరి 1 నుంచి 150 ప్లస్ డైలీ డిపార్చర్లను సాధించడంలో మరో మైలురాయిని చేరుకుని,వేడుకలను నిర్వహించుకుంది.ప్రస్తుతం ఇండిగో హైదరాబాద్ నుండి దేశీయంగా 49 నగరాలకు మరియు ఢాకా,దోహా దుబాయ్,షార్జా,రియాద్, దుమ్మాయ్, మస్కట్ కువైట్ సిటీలో సహా అంతర్జాతీయంగా 8 నగరాలకు ప్రయాణ, రవాణా సేవలను అందిస్తోంది.హైదరాబాద్‌లోని స్థిరమైన కార్యకలాపాలను బలోపేతం చేయడంలో భాగంగా హైదరాబాద్ విమానాశ్రయంలో ఇండిగో జీరో కార్బన్ ఉద్గారాలలో 7 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది.విమానయాన రంగంలో ఆచరణాత్మక పరిమితులను సమతుల్యం చేసే ఈఎస్‌జీ వ్యూహానికి ఇండిగో ఆశయం కట్టుబడి ఉందని పేర్కొంది.

## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం



ఆంజేనేయగౌడ్‌ను సన్మానిస్తున్న సుభాష్ తదితరులు

**ఆమనగల్లు,మాడ్గుల ఫిబ్రవరి03, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్‌ను శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మార్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు బరిగెల రాములు, ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్, నాగిళ్ళ గ్రామ అధ్యక్షులు సురమళ్ళ చెన్నయ్య, వీరన్నలు కలిసి చైర్మన్‌ను కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని చైర్మన్ ఛాంబర్‌లో చైర్మన్ ఆంజనేయగౌడ్‌ను కలుసుకుని శాలువాతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించి వసతులు సమకూర్చాలని వారు కోరారు.

### కంటి వెలుగు కార్యక్రమాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలి



పోచారం మున్సిపల్ పరిధిలోని 6 వ వార్డులో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభోత్సవం చేస్తున్న చైర్మన్‌తో పాటు కౌన్సిలర్ సాయిరెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని 6 వ వార్డులో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డితో కలిసి చైర్మన్ బి. కొండల్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడేవారికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తమ సమస్యను పరిష్కరించుకోవచ్చని చైర్మన్ అన్నారు. ఉచితంగా ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగపరుచుకోవాలని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ. సురేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కంటి వైద్యులు ఉమా మహేశ్వర్, శ్రీనివాస్, స్థానిక నాయకులు మధు, వెంకట రమణ, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 03,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆర్యసమాజ్ భవన్‌లో శనివారం ఉచిత వైద్య నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్ శక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. వెల్‌సెల్ హస్పటల్ వారి ఆద్వర్యంలో వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిభిరంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఉదయం 10గంటలకు వైద్య శిబిరం ప్రారంభమైతుందని ఆయన తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆయన సూచించారు.

### ఉపాధి హామీకి మొండిచేయి

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 3,(ప్రభాతవార్త):**
కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీకి మొండిచేయి చూపించిందని సిపిఐ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. బడ్జెట్‌లో కేవలవ 73వేల కోట్లు మాత్రమె కేటాయించిందని ఆయన పెర్కోన్నారు. కూలీలకు సంవత్సరానికి రెండు వందల పని దినాలు కల్పించాలని ఆయన తెలిపారు. కూలీలకు రోజుకు రూ.600ల కూలి చెల్లించాలని ఆయన అన్నారు. ఆరిక సంవత్సరానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ద్వార పేద ప్రజలకు లబ్ధి చేరుకురుతుందని ఆయన తెలిపారు.

## నక్కలపల్లి గ్రామంలో సిసిరోడ్డు నిర్మాణం



**మొయినాబాద్ ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**
నక్కలపల్లి గ్రామంలో చేవెళ్ల ఎమ్మెల్యే నిధులతో 5 లక్షల రూపాయలతో నూనతంగా సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు, ఈ సందర్భంగా సర్పంచ్ సప్నకుమారి చేతులమీదుగా పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సప్నకుమారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్ద పీఠవేస్తుందని, ఈ సందర్భంగా గుర్తుచేశారు, గ్రామాల్లో క్రీడా ప్రాంగాణములు ఏర్పాటుచేసి యువకులకు ఆటపటలకు ఎంతో ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు, మా గ్రామానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయకు ప్రత్యేకంగా 5 లక్షల ఎమ్మెల్యే నిధిని మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు, ఎమ్మెల్యే యాదయ్య గ్రామాల్లో ఎ సమస్యలను తన దృష్టికి తీసుకెల్లాగానే వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారని ఈ సందర్భంగా గుర్తుచేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న కుమారి, ఉపసర్పంచ్ రాజు, మాజి ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయితీ కార్యాదర్శి ప్రయాంక, నాయకులు రాములు శ్రీకాంత్ నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రభుత్వం ప్రారంభించే మటన్ షాపులు అరెకటికలకే కేటాయించాలి

**- తెలంగాణ అరె కటిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ కార్ జాంగీర్**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :**
తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని రాష్ట్రంలో ప్రారంభించబోయే మటన్ షాపులను అరెకటికలకే కేటాయించాలని తెలంగాణ అరెకటిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ కార్ జాంగీర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంకు వద్ద మటన్ షాపులను ప్రారంభించబోతున్నారని అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మటన్ షాపులు ఏర్పాటు చేయడం జరుగుతున్నందన్న ప్రకటన వెలువడటం జరిగిందని, ఆ మటన్ షాపులు అరెకటికలకు కేటాయించాలని లక్షలాది మంది అరెకటిక కుటుంబాలు ఆదుకోవాలని ఆయన కోరారు. ఆరె కటికలకు న్యాయం చేయలేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

### అయ్యవారిపల్లి వాగులో మహిళ మృతి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :**
ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి వాగులో ఓ మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామ సర్పంచి లక్ష్మీరమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఉడిత్యాల గ్రామానికి చెందిన తిరుపతమ్మ భర్త ఎల్లయ్యగా గుర్తించడం జరిగిందని, ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట అభివృద్ధి

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



తిలక్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ ఎన్.అమృత

హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట నియోజకవర్గంలో అబివృద్ధి పనులను చేపడుతున్నా మని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్, తిలక్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎన్.అమృతతో కలిసి ఎమ్మెల్యే ఫండ్ కింద 27లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. అంతకు ముందు ఈ సందర్భంగా స్థానిక కాలనీలో పర్యటించి ప్రజల సమ స్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట డివిజన్‌లో తాను ఎమ్మెల్యే కాకముందు అనేక సమస్యలు నెలకొన్ని ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని సమ స్యల న్నింటిని సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల దృష్టికి తీసుకొచ్చి దశలవారిగా సమస్యలను పరిష్క రిస్తు న్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు నెలకొన్ని తన దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కరానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిఆర్ఎస్, బిజెపి నేతలు, స్థానిక బస్తీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**ఎర్రోళ్ల శ్రీనివాస్**



5వ వార్డు సంజీవయ్య నగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన మెడికల్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చిత్రంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకట్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రతి పేద వాడికి మెరుగైన ఉచితవైద్యం అందించాలన్న దృడసంకల్పంతో బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని టీఎస్.ఎం.ఎస్.ఐడిసి చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 5వ వార్డు సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగుశిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రుల కంటే దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు పనిచేస్తున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు టీ డయగ్నాస్టిక్ ద్వారా 56 పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు జరుపుతుందన్నారు. అదే విధంగా వివిధ రోగాలతో బాధపడుతున్న రోగులకు 80 రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట్, ఎస్.పి.హెచ్ఓలు డాక్టర్ రాజకుమారి, లక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విశాల్,బస్తీ అధ్యక్షులు కొంపల్లి దాస్,నాయకులు నర్సింగ్, అనీల్, శివా,రవి, సుధాకర్, మార్కెట్ మాజీ డైరెక్టర్ మహంకాళి షర్వీన్, మాదిగ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు



మధురానగర్ ఇండోర్ స్టేడియం వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సినీ హీరో విశ్వకార్తికేయ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : వెంగళ రావ్ నగర్‌లోని మదురా నగర్ సంక్షేమ సమితి సామాజిక భవనం శ్రీసాగి రామకృష్ణమరాజు హాల్, దండు చిన్నసత్యనారాయణ ఇండోర్ స్టేడియం లో, జిమ్ 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కోడె సాంబశివరాజు అద్యక్షత వహించగా ప్రముఖ సిని నటి దివ్యవాణి, సినిహీరో విశ్వకార్తికేయలు పాల్గొన్నారు. ఈవార్షికోత్సవ సందర్భంగా కాలనీలోని విద్యార్థిని విద్యార్థులకు పలు ఆటల పోటీలను నిర్వహించారు. అందులో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రశంసపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో సమైక్యంగా అబివృద్ధి పథంలో ఆదర్శంగా నిలిచిన మధురానగర్ కాలనీలో జరిగిన ఈవేడుకల్లో తాను పాల్గొని బహుమతులను ప్రధానం చేయడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా కాలనీలోని సీనియర్ సిటిజన్స్ కూడా క్యారమ్స్, టిటి, స్పీడ్ వాక్ వంటి పోటీలను నిర్వహించడం జరిగింది. దాదాపు 130మంది విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు కోడెసాంబశివరావు, దామోదరరావు, అజయ్‌కుమార్, కార్యదర్శి కళ్యాన్ చక్రవర్తి, గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు వృత్తి జీవితంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్**



మాట్లాడుతున్న ఒయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్,చిత్రంలో రిజిస్టార్ ప్రొ.లక్ష్మినారాయణ

తార్నాక, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ఉద్యోగులు వృత్తి జీవితంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఒ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. వృత్తి జీవిత లక్ష్యాలను వేగవంతం చేయటంలో చక్కని ఆరోగ్య అలవాట్లు అనే అంశంపై ఒ.యూ సెనేట్ హాల్లో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన సదస్సుకు వైస్ చాన్స్‌లర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏదైన చేయగలం అన్నారు. అందుకు ఆరోగ్యం కోసం వ్యాయమం, ఆహారపు అలవాట్లు, సంతోషమైన జీవితంతో జీవనం కొనసాగించాలని సూచించారు. అమెరికా హుస్టన్ నగరంలోని ఎమర్జెన్సీ మెడిసిన్ మెడికల్ డైరెక్టర్ డా.రాధేశ్యాం మిర్యాల మాట్లాడుతూ జీవనం శైలిలో వస్తున్న మార్పులే అన్ని జబ్బులకు కారణమన్నారు. ఆరోగ్య జీవనానికి ప్రతి ఒక్కరు ఒకే విధమైన పారామీటర్స్ ఉండవచ్చున్నారు. జీవితాన్ని ఆనందమయం చేసుకోవడం వల్లే వ్యాధులకు దూరంగా ఉండోచ్చన్నారు. సాటి వ్యక్తులను ప్రేమించడం వల్లనే వ్యాదులకు దూరంగా ఉండోచ్చన్నారు. యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.మల్లేశం, ప్రొ. శశికాంత్ కులకర్ణి, డా. చలమల వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొ. లక్ష్మినారాయణ,రామ్‌దాస్ మంతెన, ప్రొ.మంగు నాయక్, ప్రొ.శిరీష, ఉద్యోగ సంఘాల నాయకులు జ్ఞానేశ్వర్, భోధన, భోదనేతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్.బాల్‌రాజ్

సైఫా బాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు, పుర పాలక సంఘాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 24 వేలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసఫ్, ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఏరియర్స్ చెల్లించని మున్సిపాలిటిలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట జరిగిన కార్మికుల భారీ ధర్నాలో వారు ప్రసంగించారు. కార్మికులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ , ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లింపులు సక్రమంగా అమలు చేయాలని, ఇఎస్ఐ గుర్తింపు కార్డులు పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి డిప్యూటి ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులకు 12వ పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎఐటియుసి నేతలు పి.ప్రేమ్‌పావని, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యేసురత్నం, మందా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అన్నమాచార్య సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం

మెహిదీపట్నం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ సత్యనారాయణ కాలనీలో నడుపబడుచున్న అన్నమాచార్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం, సద్గురు త్యాగరాజ స్వామి వారి 176వ సంగీత ఆరాధనోత్సవ వేడుకలు ఈనెల 4న గుడిమల్కాపూర్‌లోని సాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యస్.వి. రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మామిడి హరికృష్ణ, గౌరవ అతిథిగా యం. రామ్‌రాజ్, ఆత్మీయ అతిథిగా శివకుమార్‌లు హాజరైతున్నట్లు, వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం పూజా కార్యక్రమం, సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి పంచరత్న కీర్తనల గోష్ఠిగానంతో పాటు సాయంత్రం 200 మంది కళాశాల విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వార్షిక పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ చేస్తామన్నారు.

# కంటి వెలుగు డాక్టర్ల బృందానికి అభినందన



డాక్టర్ల బృందంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి. చిత్రంలో పద్మజ, ఎం.మనోజ్‌రెడ్డి తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: పది రోజులపాటు సచివాలయంలో 'కంటి వెలుగు' ప్రత్యేక శిభిరాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్లు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అభినందించారు. ఈ శిభిరంలో మొత్తం 1240 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది. హైదరాబాద్ డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ ఆధ్వర్యంలో 18 మందితోగల వైద్య బృందం గత నెల 23వ తేదీ నుంచి ఈ శిభిరాన్ని నిర్వహించింది. సచివాలయంలో 1240 మంది అధికారులు, ఉద్యోగులకుక నేత్రాల పరీక్షలు నిర్వహించడం జరిగిందని పద్మజ తెలిపారు. వీరిలో 550 మందికి రీడింగ్ గ్లాస్‌లు, 404 మందికి కండ్లద్దాల కోసం రిఫర్‌చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దీప్తిప్రియాంక, ఎం.మనోజ్‌రెడ్డి, మాధురి, సందీప్, దాసీరెడ్డి, ఆలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తను పరామర్శించిన మంత్రి



కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు సిరాజ్ ను పరామర్శిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సిరాజ్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెల్సుకున్నారు.గత కొన్ని రోజుల క్రితం అస్వస్థతకు గురైన సిరాజ్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.ఈ సందర్భంగా మంత్రి తలసాని సిరాజ్ కు మెరుగైన వైద్యం అందించాలంటూ వైద్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కిమ్స్ హాస్పిటల్ ఛైర్మన్ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ డిసిపిని కలిసిన వ్యాపారులు



ట్రాఫిక్ వన్ డిసిపి బి.కె.రాహుల్ హెగ్డేను కలిసిన వ్యాపారులు

చార్మినార్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ట్రాఫిక్ వన్ డిసిపిగా నియమితులైన బి.కె రాహుల్ హెగ్డేను పాతబస్తీకి చెందిన వ్యాపారి సంజయ్ అగర్వాల్‌తో పాటు పలువురు కలిశారు. నూత న ట్రాఫిక్ డిసిపి వన్ బి.కె.రాహల్ హెగ్డేను వారు శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో వ్యాపారి సంజయ్ అగర్వాల్,దిలీప్,మహేందర్‌రావు,అశిష్ పండిత్ సిక్‌వాల్ బాబు భాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాను రెండవ రాజధానిగా చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లాను రెండవ రాజధానిగా చేయాలని మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు టైగర్ అశోక్‌నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని ఎంటిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టైగర్ అశోక్‌నేత మాట్లాడుతూ ప్రజాపరిపాలన సౌలభ్యం కోసం ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందడానికి కరీంనగర్ జిల్లాను రాజధానిగా చేయాలన్నారు.

# టిఆర్ఎస్‌ను బొందపెట్టేది బిజెపి మాత్రమే : బిక్షపతి యాదవ్

**పార్టీ జెండా ఆవిష్కరించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**



పార్టీ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న బిజెపి శ్రేణులు

మూసాపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మారబోయిన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బిక్షపతియాదవ్ ఇతర బిజెపి ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యలయ ప్రారంభోత్సవంలో చేవెళ్ళ మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ గతంలో నేను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు ఎక్కడ అవినీతి లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసామని అన్నారు. ప్రస్తుతం టిఆర్ఎస్ నాయకులు చెరువుల కబ్జా దగ్గర నుంచి మొదలుకుని ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్న దోచుకోవడం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాలమయమై హైదరాబాద్‌లో చుట్టూ ఉన్న విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకొని డబ్బులు దోచుకొని ఎన్నికల్లో ఖర్చుచేస్తున్నారని ఆరోపించారు.

**దేశాన్ని దోచుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

అవకాశం వస్తే దేశాన్ని దోచుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసారని, ఇక్కడ ప్రజలు తన్ని తరిమేస్తారన్న భయంతోనే బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసుకుని దేశాన్ని మారుస్తానని సీఎం కెసిఆర్ దేశంలో తిరుగుతున్నట్లు మాజీ చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. టిఆర్ఎస్ పార్టీలో కెసిఆర్ చెప్పే నీతులన్నీ నిజమనుకుని గతంలో టిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలియజేశారు. ఎప్పుడైతే వాళ్ళు రాష్ట్రాన్ని అబద్ధపు మాటలు చెప్పి దోచుకుంటున్నారని తెలిసిందో అప్పటి నుండి తిరుగుబాటు మొదలు పెట్టి పార్టీ నుంచి బయటకు వచ్చి బిజెపిలో చేరినట్లు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో బిజెపి గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు హరీష్‌రెడ్డి, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పోరేటర్ కంటెస్టెడ్ అభ్యర్థి ఎస్ఎస్‌డి స్కూల్ యజమాని సురభి రవీందర్, బిజెపి నాయకులు నరసింహాచారి, నర్సింగ్‌యాదవ్, కుమార్‌యాదవ్, కమాలకర్‌రెడ్డి, మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ జిహెచ్ఎంసీలో విలీనం జరిగితేనే అభివృద్ధి



ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డిని కలిసిన కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం ఏబేలు, సంకి రవీందర్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే జిహెచ్ఎంసీలో విలీనం అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ మాజీ ప్రధాన కార్యదర్శి ఫోరమ్‌ఫర్‌గుడ్ గవర్నెన్స్ పద్మనాభరెడ్డి తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం ఏబేలు, ప్రధాన కార్యదర్శి సంకిరవిందర్‌ల ప్రతినిధి బృందం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాల విలీనంపై కంటోన్మెంట్ బోర్డు జిహెచ్ఎంసీలో విలీన పరిణామాలపై చర్చించారు.వికాస్ మంచ్ చేపట్టిన పోరాట ఫలితంతోనే కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రభుగుప్త, మహ్మద్‌పసీ, అంబాల శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురు హార్రాయ్ సాహెబ్‌జీ మహారాజ్ జన్మదినం



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సిక్కు ప్రముఖులు

చార్మినార్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ సిక్‌చావనీలో శు క్రవారం శ్రీ గురు హర్రాయ్ జాహెబ్ జీ మహరాజ్ 393 జన్మదినం సందర్భంగా సిక్ చావనీ బారంబర్ గురుద్వారాలో రంజిత్ సింగ్ జీయత్రి నివాస్ 20 గదుల నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిక్కుల గురువులైన కాశ్మీర్ సింగ్‌జీ,హరిపాల్ సింగ్ బీదర్,అర్పాల్ సింగ్‌లు విచ్చేశారు.అనంతరం హుడాకాలనీలోని షహీద్ బాబా అల్వర్ సింగ్ జీ అస్తన్ హాల్‌కు భూమి పూజ జరిగింది.4,5 తేదీలలో సిక్ చావనీలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.ఈ కార్యక్రమంలో సుఖ్‌దేవ్ సింగ్,గురు చరణ్ సింగ్,రవీందర్ సింగ్,సుజిత్ సింగ్ సంతోష్ సింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ ట్రాఫిక్ ఎసిపిగా కె.శ్రీనివాస్‌రావు



శ్రీనివాస్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్‌రావు

చార్మినార్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : సౌత్ జోన్ ట్రాఫిక్ ఎసిపిగా కె.శ్రీనివాస్ రావు బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటి వరకు సౌత్ జోన్ ట్రాఫిక్ ఎసిపిగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా సౌత్ జోన్ ట్రాఫిక్ ఎసిపిగా నియమితులైన శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజల సహకారంతో పాతబస్తీలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. సౌత్‌జోన్ ట్రాఫిక్ ఎసిపిగా నియమితులైన శ్రీనివాస్‌రావు నల్గొండ డిటిసి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఎసిపి శ్రీనివాస్‌రావు గతంలో చార్మినార్ ట్రాఫిక్ సిఐగా,ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

# కాసాని జ్ఞానేశ్వర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీలు



కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, మహేందర్‌రెడ్డి

నిజాంపేట్,ఫిబ్రవరి3 ప్రభాతవార్త: తెలంగాణ టీడీపి అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తల్లి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన నియోజక వర్గ ప్రజలకు విధితమే. శుక్రవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్సీ పి. మహేందర్‌రెడ్డి కాసాని జ్ఞానేశ్వర్‌ను తన నివాసానికి వెళ్ళి పరామర్శించి ధైర్యం చెప్పారు. జ్ఞానేశ్వర్‌ను పరామర్శించిన వారిలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, విజలక్ష్మీ, చిట్ల దివాకర్, మేకల వెంకటేష్, గాజుల సుజాత, కాసాని సుధాకర్ ముదిరాజ్, బాలాజీ నాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ సలీం, రంగరాయ ప్రసాద్, చంద్రగిరి సతీష్, భౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ దయాకర్‌రెడ్డి ఉన్నారు.

# రోడ్లపై ఆడుకోవద్దు.. కదిలే బస్సులో నుంచి దూకవద్దు

**పాఠశాల చిన్నారులకు ట్రాఫిక్ ఎస్సై అవగాహన**




బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ వద్ద చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై జ్యోతి

బేగంపేట ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : చిన్నారులు పాఠశాలలకు వచ్చే బస్సులు కదులు తున్న సమయంలో వాటి నుంచి కిందికి దూకవద్దని,రోడ్లపై ఆడుకోవద్దని, తప్పని సరి సంకేతాలు, సమాచార సంకేతాలను గమనించాలంటూ బేగంపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ సి.హెచ్.జ్యోతి విధ్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇన్స్టూట్ లో ఏసీపీ జి.శంకర్‌రాజు ఆదేశాలమేరకు ఎస్సై జ్యోతి, సిబ్బంది రాజేష్,సుమన్‌కుమార్,చక్రధర్,సేఫ్టీ ట్రైనర్ శ్రావణిలతో కల్సి విధ్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విధ్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించారు.జీబ్రా క్రాసింగ్‌ల వద్ద రోడ్డు దాటాలని వారికి సూచించారు.ఈ సందర్భంగా విధ్యార్ధులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కి చెందిన గీతాంజలి పాఠశాలలకు చెందిన 150మంది విధ్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి సహకరిస్తా : శ్రీగణేష్



5వ వార్డు సంజీవయ్య నగర్‌లో రామాలయాన్ని సందర్శించిన శ్రీగణేష్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్‌లో నూతనంగా నిర్మించనున్న శ్రీ రామాలయం నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తా నని కంటోన్మెంట్‌కు చెందిన ప్రముఖ నేత ఎన్.శ్రీగణేష్ తెలి పారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లి, సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీలో నూతనంగా నిర్మించబోతున్న రామాల య గుడి స్థలాన్ని ఆయన పర్యవేక్షించారు. ఆలయ నిర్మాణానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భాస్కర్ రెడ్డి, సంతోష్, నర్సింగ్, కోటేశ్వర్ రావ్, శ్రీనివాస్, ప్రమోద్, రాజు, సంపత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు, ప్రజా ప్రతినిధులంతా పోలీసు శాఖకు సహకరించాలి



నార్సింగి నూతన ఏసీపీ రమణాగౌడ్‌ను సన్మానిస్తున్న గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా తదితరులు

నార్సింగి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : నార్సింగి ఏసీపీ రమణాగౌడ్‌ను శుక్రవారం గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ సైతం పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతన ఏసీపీ రమణాగౌడ్ మాట్లాడుతూ శాంతి భద్రతల స్థాపనకు ప్రజలు, ప్రజా ప్రతినిధులంతా పోలీసు శాఖకు సహకరించాలన్నారు. పౌరులందరూ యూనిఫాం లేని పోలీసులేనని, మీ చుట్టూ ఏమైన అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే స్పందించి 100.కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ రమణాగౌడ్ పేర్కొన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ల కొంటున్న ప్రజలు కేవలం రూ.15.వేలు పెట్టి ఇంటికి 24.గంటలు భద్రతనిచ్చే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకపోవడం విచారకరమని, ఈ అంశంపై పోలీసు శాఖ నుంచి అనేక అవగాహన సదస్సులు నిర్వహించా మన్నారు. నాయకులు సైతం ప్రజలను సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రోత్సహించాలన్నారు. అనంతరం నర్సిహ్మా, అశోక్ యాదవ్‌లు మాట్లాడుతూ పోలీసులకు మావంతు పూర్తి సహకారం అందిస్తామ న్నారు. పోలీసులు ఉండడం వల్లనే సమాజంలో శాంతి భద్రతలు ఉన్నాయని, అన్ని వర్గాల ప్రజలు కలిసి,మెలిసి ఉంటున్నారని తెలిపారు. ఏసీపీని సన్మానించిన వారిలో కౌన్సిలర్ విజయ్ బాబు, హరిశంకర్, వినోద్, రాము, వేణుగౌడ్, కిరణ్, శ్రావణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీకి నిధులు తగ్గింపుపై నిరసన



నిరసన తెలుపుతున్న సిఐటీయు నాయకులు.

**బొంరాస్‌పేట్, ఫిబ్రవరి3, ప్రభాతవార్త ః**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జాతీయ ఉపాధిహామీ పథకంకు 40శాతం నిధులు తగ్గింపుపై ప్రజాసంఘాల అధ్వర్యంలో జిల్లా సిఐటీయు నాయకులు బుస్స చంద్రయ్య దుద్యాల్ మండల కేంద్రంలో ప్రధాన మంత్రి మోది దిష్టిబోమ్మనుదగ్ధంచేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 45లక్షలతో ఆర్భాటంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని అందులో జాతీయ ఉపాధిహామీ పథకంకు,ఆహర సబ్సిడి,రైతులకు ఇచ్చే ఇన్సు రేన్స్,సబ్సిడిలపైన భారీగా కోత విధించడం గ్రామీణప్రాంత ప్రజల నోట్లో మట్టికొట్టిందన్నారు.రైతులకు గిట్టుబాటు ధర గురించి చట్టం తీసుకోస్తామని చెప్పి మోది దాని గురించి ప్రస్తావననే లేదు.విద్యా,వైద్యంకు నామమాత్రంగా 2వేల కోట్లను అదనంగా కేటాయించి చేతులు దులుపుకుందన్నారు.ఈ బడ్జేట్‌లో గ్రామీణ ప్రాంత ప్రజలకంటే కార్పొరేట్ సంస్థలకు అనుకులంగా ఉందన్నారు.తక్షణమే వీటి పై పునరాలోచన చేయాలని అయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి మల్లప్ప,బిఆర్ఎస్ నాయకులు నరేష్‌గౌడ్,బిఆర్ఎస్,సిఐటీయు నాయకులు పాల్గోన్నారు.

## ఘనంగా లక్షబిల్వార్చన పూజ



అన్నదాన కార్యక్రమంలో శివస్వాములు

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**
దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో శ్రీ విజయేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారంరోజు ఘనంగా లక్షబిల్వార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు.ఆలయ ధర్మకర్త,మాజీ ఎంపీపీ గౌడంపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, సంకల్పం,రుద్రాభిషేకం, శివార్చన,శివాష్టకం,బిల్వాష్టకం,లింగాష్టకం,శివాష్టోత్తర శతనామావళి, ధూప, దీప,నైవేద్యాలను సమర్పించారు.శివలింగానికి మంగళహారతులు యిచ్చి శివనామ స్మరణతో వైభవంగా లక్షబిల్వార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.శివస్వాములు భజనలు చేస్తూ శివనామస్మరణతో మార్మోగించారు. అనంతరం శివస్వాములకు,భక్తులకు,ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని శివస్వాములు, గ్రామపెద్దలు,యువకులు,గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు.

## అనాధ బాలికలకు కుట్టుమిషన్లు అందజేత



**పరిగి ఫిబ్రవరి3, ప్రభాతవార్త :**
పరిగి కేంద్రంలో బాలసదనంలో కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ అనాధ బాలికలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జ్యోతి లింగ,పాండు, రాకేష్,చపల గూడెం సర్పంచ్ లక్ష్మణ్,కుల్కచర్ల మాజీ సర్పంచ్ జానకి రామ్,నరేష్,సిబ్బంది,చిల్డ్రన్,హోం సూపరిడెంట్, ఇందిరా, రాఘవేంద్రమ్మ,ఆంజనేయులు,వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం**
దోమ మండలం గోదుగొనిపల్లికి చెందిన నిరుపేద సౌర్ల పద్మమ్మ ఆకస్మికంగా మరణించింది.ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి తన కెఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు ద్వారా అంత్యక్రియలకు తక్షణ అవసరాల కొరకు బాధిత కుటుంబానికి 10వేల రూపాయలను అందజేశారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సర్పంచ్ అమృతమ్మ ఆంజనేయులు,వెనచేటి భీమయ్య,గుజ్జు రాజశేఖర్ రెడ్డి,చక్కలి గోపాల్,భోగం అంజీలయ్య,భోగం రాములు,చెక్కలి మానికయ్య,మైస అంజిలమ్మ,వెనచెట్‌రమేష్,జాలారి తిరుపతయ్య,యువకులు,పాల్గొన్నారు.

**నర్సమ్మకు ఆర్థిక సహాయం**
మండల పరిధిలోని పాల్లేపల్లి గ్రామానికి చెందిన శివనగరి నర్సమ్మ కొన్ని సంవత్సరాలుగా కాళ్లు లేక నడువలేక ఇబ్బంది పడుతుంది ఈ విషయం గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి 10వేల రూపాయను ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అజయ్ కుమార్ రెడ్డి,శేరి రామ్ రెడ్డి,చపల గూడెం సర్పంచ్ లక్ష్మణ్, మామిళ్ల లలన్న,ప్రతాప్ గౌడ్,వెంకట్,మనీ సాగర్,చెంద్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది



షాబాద్‌లో మాంటిసోరి పాఠశాలలో మొక్కలను పంచుతున్న లక్ష్మినివాస్

**షాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**
పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మానవ మనుగడకు చెట్లే ప్రాణధారమని తెలంగాణ సామాజిక స్టూడెంట్ అర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ తెలిపారు. శుక్రవారం షాబాద్‌లో మాంటిసోరి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమాజంలో మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థుల్లో ఉందన్నారు. విద్యార్థులు సామాజిక స్పృహను అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఇంటి ఆవరణలో, వ్యవసాయ పొలంలో మొక్కలు నాటాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పగుడాల సుధాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు వంశీ, మహేందర్, కిరణ్, వెంకట్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**యాచారం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**
మండలంలోని తక్కెళ్లపల్లి ఫీడర్ మరమ్మత్తులు చేపడుతున్నందున నేడు తక్కెళ్లపల్లి, తక్కెళ్లపల్లి తండా, వేపపురి తండాల పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు విద్యుత్ తీగలను సరిచేయడం, మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

# రంగాపూర్ చౌరస్తాలో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

**-బోండకొండ అభివృద్ధికి రూ.6.65 కోట్లు ఖర్చు**
**-ప్రగతి నివేదిక యాత్రలో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి**

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి3, ప్రభాతవార్త :**
రంగాపూర్ చౌరస్తాలో సంత్‌సేవలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాంమని బిఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు.ఆయన చేప్పటిన ప్రగతి నివేదిక యాత్ర 13వ రోజు మంచాల మండలం బోడకొండకు చేరుకుంది.మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్‌రెడ్డి (బంటి) మాట్లాడుతూ నియోజకవర్గంలో తన తండ్రిని 3సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని,మీ ఇబ్బందులను తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేకర్‌రావు ప్రవేశపెట్టిన సంక్షేమ,అభివృద్ది కార్యక్రమాలు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యర్యంలో గ్రామాలు అభివృద్ధి జరుగుతున్నయన్నారు.బోడకొండలో ప్రతినెల 203మందికి వివిధ రకాల పెన్షన్లుకు4.5లక్షలు పంపిణీ జరుగుతున్నటు తెలిపారు.అదేవిదంగా రైతుబందు ద్వార 383మంది రైతులకు62.65లక్షలు ఇస్తున్నమన్నారు.రైతుబీమాద్వార 25మంది రైతులు చనిపోతే 1.25కోట్లు వారి కుటుంబాలకు అందజేశామన్నారు.కళ్యాణలక్ష్మిపథకం ద్వార 115మంది నిరుపేద కుటుంబాలకు 79.62లక్షలు అందజేశామన్నారు.సీఎంఆర్ఎఫ్ ద్వార 38 మందికి 13.04 లక్షలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చంద్రయ్య,ఎంపీపీకృపేష్,పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్, ఎంపీటీసీ నర్మాదాలచ్చిరాం,నాయకులు శ్రీను, అలివేలు,బిక్షునాయక్,బద్రినాథ్ గుప్త,సుకన్య,జానీబాష,సికిందర్,రవి,కష్ణనాయక్,బాలు,టిల్లు అంజమ్మ తదితరులు పాల్గోన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

# దుర్వాసన వెదజల్లే ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలి: దండెం రాంరెడ్డి



ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దండెం రాంరెడ్డి, శేఖర్

**యాచారం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**
మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో వెంకటేశ్వరస్వామి గుడి పక్కన, రైతుల పంట పొలాల మధ్యలో ఏర్పాటు చేసిన కిసాన్ అగ్రో ఫీడ్స్ కంపెనీని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న చేపట్టిన నిరసన దీక్షకు కాంగ్రెస్ పార్టీ తరపున టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవిరుద్దంగా పశువుల వ్యర్థాలను నిల్వ ఉంచి వాటితో కల్తీ వంట నూనె, డాల్డా, నెయ్యి వంటివి ఈ కంపెనీలో చేస్తున్నారన్నారు. ఈ పశువుల వ్యర్థ పదార్థాలు నిల్వ ఉంచడం వలన చుట్టుపక్కల గ్రామాల్లో భరించలేని దుర్గంధం రావడంతో చుట్టుపక్కల గ్రామాలు తక్కళ్లపల్లి, తుమ్మలోనిగూడ, కిషన్‌పల్లి, చింతపల్లి తండాలలోని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అదే విధంగా ఇక్కడ తయారు చేసిన ఈ కల్తీ నూనెను హైద్రాబాద్ వంటి నగరాలకు తరలించి అక్కడి ప్రజల ఆరోగ్యాలకు కూడా హాని కలిగిస్తున్నారన్నారు. వెంటనే దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కంపెనీని మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ్ల వెంకట్‌రెడ్డి, దిండి రాంరెడ్డి, పండల రమేష్; దిండి రవీందర్‌రెడ్డి, కృష్ణ, జగన్‌మోహన్‌గౌడ్, ఏర్పుల శేఖర్ యాదవ్, కావలి జగన్, కంబాలపల్లి జంగయ్య, తలారి సత్యం, చిక్కుడు గుండాలు, సోమరాజు శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, తాలంపల్లి నర్సింహ, కావలి బాలయ్య, ఎండి రణి, నగిళ్ల వెంకటయ్య, మరెడుపల్లి నరేందర్‌రెడ్డి, రాంబాబు, శ్రీకాంత్, గ్రామస్తులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పురాతన ఆలయ పునఃప్రతిష్ట నిర్మాణానికి పూజలు

## మల్లిఖార్జునుని సేవలో సరోత్తం రెడ్డి

**నందిగామ ఫిబ్రవరి3, ప్రభాతవార్త :**
మహిమాన్వితి పురాతన మల్లిఖార్జున స్వామి ఆలయ పునప్రతిష్ట నిర్మాణ భాగ్యం తనకు లభించడం పుర్వజన్మ సుకృతమని ప్రముఖ సంఘ సేవకుడు చెరుకు సరోత్తం రెడ్డి అన్నారు.శుక్రవారం నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.270 సంవత్సరాల క్రితం రాతిబండపై నిర్మితమైన మల్లీఖార్జున దేవాలయం శిథిలావస్థకు చెరుకున్న నేపథ్యంలో గ్రామపెద్దల నిర్ణయం మేరకు వాస్తుప్రకారం పున: నిర్మాణం చేసేందుకు సరోత్తం రెడ్డి ముందుకు వచ్చి గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సరోత్తం రెడ్డి మాట్లాడుతూ...సృష్టికి మూలం భగవంతుడని,సమస్త జీవకోటి ఆయన అదుపు ఆజ్ఞలోనే సాగుతుండటం మహిమాన్వితమన్నారు.పరమ పవిత్ర ఆలయ నిర్మాణ యజ్ఞంలో రాజకీయాలు తగవన్నారు.శివుడి ఆజ్ఞలేనిదే చీమైన కుట్టదని,ఆయన ఆశీస్సులతోనే తాను గుడి నిర్మాణానికి ముందుకు వచ్చామని అన్నారు. ఆలయాలు మనకు ధర్మాన్ని నేర్పిస్తాయని,సమాజంలో ఉత్తమంగా జీవించాలంటే దైవదర్శనం చేయాలన్నారు.లోక కళ్యాణం కోసం భగవంతుడు అవతరించాడని,వెంకమ్మగూడలో పురాతన మల్లిఖార్జున స్వామి దేవాలయం పున: ప్రతిష్ట నిర్మాణ యజ్ఞం లో ప్రతి ఒక్కరూ సమిష్టిగా సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన నిర్మాణకరనత సరోత్తం రెడ్డిని గ్రామపెద్దలు,ప్రజాప్రతినిధులు,పూలమాల ,శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త బుయ్యనీ వీరేందర్ గౌడ్,ఉప సర్పంచ్ మధుగౌడ్,చేగూరు సింగిల్ విండో చైర్మన్ జి.అశోక్,బండోనిగూడ సర్పంచ్ జెట్టాకుమార్,మల్లప్ప,ఆలయ పూజారి వీరేశం పంతులు,రాజయ్య,సోమేశ్వర్,కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ధరూర్ సతీష్ పటేల్,భుగ్గశ్రవణ్, పి.నరేందర్, శ్రీనివాస్, మంకాల శ్రీశైలం,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.నూతనంగా నిర్మిస్తున్న ఈ మల్లిఖార్జున స్వామి దేవాలయాన్ని రెండవ శ్రీశైలంలా నిర్మించేందుకు తీర్మానించడం విశేషం



మల్లీఖార్జున స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న చెరుకు సరోత్తం రెడ్డి,తదితరులు

## పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**
శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల పట్టాలు ఉన్న పేదలందరికి ఇళ్ల స్థలాలు చూపించాలని లేకుంటే డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని సీఐటీయూ రైతు సంఘం ప్రజాసంఘాలు శంకర్‌పల్లి ఎంఆర్‌వోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ హాజరై మాట్లాడుతూ....శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో చాలా మంది పేదలకు గత ప్రభుత్వం ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న పుడు ఇళ్ల పట్టాలు ఇచ్చారని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇలా జాగాలో చూపించలేదని ప్రభుత్వం వెంటనే సర్వే నెం.278లో పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించారు. కాబట్టి గతంలో ఇళ్ల పట్టాలు పొందిన వారందరికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, రైతు సంఘం జిల్లా నాయకులు మల్లారెడ్డి, శంకర్‌పల్లి పట్టణ నాయకులు మల్లేష్ తారాసింగ్ తదితరులు ఉన్నారు.

## ప్రొటీన్‌తో మాతృమూర్తి ఆరోగ్యం మెరుగుపడుతుంది

**- పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :** సరియైన సమయంలో సరియైన ప్రోటీన్ తీసుకోవడం వల్ల మాతృమూర్తి ఆరోగ్యం మెరుగవుతుందని, తద్వారా చిన్నారులు సహితం ఆరోగ్యంగా ఉంటారని పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పాలమూరు ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన నమో మాతృమూర్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్, హాజీపల్లి గ్రామాల్లో ట్రస్ట్ చైర్మన్ మాతృమూర్తులకు ప్రొటీన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలకు సరియైన సమయంలో సరియైన పోషకాహార పదార్థాలు తీసుకోవడంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. రెండు నెలలకు గాను 4 ప్రొటీన్ బాక్సులను ఒక్కో గర్భిణీకి, బాలింతకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రొటీన్ విటమిన్ పౌడర్ బాక్సులను స్వయంగా వారి ఇంటి వద్దకే వెళ్లి అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మాతృమూర్తి తమ ట్రస్టు ద్వారా ఈ ప్రొటీన్ బాక్సులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, మోహన్ సింగ్ నాయక్, ఆకుల ప్రదీన్, శ్యామ్ సుందర్‌రెడ్డి, మంగ విజయ్, అంజన్న, పాండురంగారెడ్డి, నర్సింహాయాదవ్, సుదీర్ పటేల్, సుభాష్‌రెడ్డి, నరేందర్, రామంజజి, వంశీ, రవి, రవికాంత్, నర్సింహ, మల్లేష్, కృష్ణ, పాండు, ప్రకాష్, వెంకట్‌రాంరెడ్డి, వెంకటేష్, లింగం, నర్సింహాగౌడ్, ప్రదీప్, భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రొటీన్ బాక్సులను అందజేస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు


## ఆధ్యాత్మిక చింతనతో మనసుకు ప్రశాంతత :ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో వేద పాఠశాల నిర్వహకులు, విద్యార్థులు.

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త) :**
ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల మనస్సుకు ప్రశాంత వస్తుందని, తద్వార పునరుత్తేజంతో మరింత మెరుగైన పనులు చేయడానిక శరీరం సహకరిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్ నగర్ మండలం కిషన్ నగర్ గ్రామ శివారులోని జగద్గురు వీరశైవ ఆగమ పాఠశాలలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్టాపించడం మనం చేసుకున్న పూర్వ జన్మసుకృతం అని ఆయన అన్నారు. ప్రజలందరికీ స్వామి కృపా కటాక్షం ఎల్లవేళలా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మన్‌నాయక్, వేద పాఠశాల పురోహితులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అవాస్తవాలను ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు : సర్పంచ్ కృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బండమీది కృష్ణ

**యాచారం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్రకు ప్రజల నుండి వస్తున్న విశేష స్పందనను ఓర్వలేక ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని బిఆర్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ బండమీది కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యాచారం మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతంగా ప్రగతి నివేదన యాత్ర పూర్తి చేసుకుని గడ్డమల్లయ్యగూడకు చేరుకుందన్నారు. గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపి యాక్సిడెంట్‌కు కారణమయ్యాడని, ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందడంతో పాటు మరికొందరు గాయపడ్డారన్నారు. దీనిని సాకుగా తీసుకుని బిజెపి, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్రపై నిందనలు మోపడం సరికాదన్నారు. గత 15 ఏళ్లుగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా కృషి చేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిలపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆరోపణలు చేసేవారు ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో ఆదరాభిమానాలు పొందాలే తప్ప ఇతరులపై అసత్య ఆరోపణలు ప్రచారం చేసి లబ్ధి పొందాలనుకోవడం సరికాదన్నారు. అసత్య ఆరోపణలు చేస్తున్న వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ బండమీది కృష్ణ, బొల్లంపల్లి వెంకటేష్, మండల గోపాల్, అచ్చన దానయ్య, తలారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి రూ. 30 లక్షల నిధులు కేటాయించాలని మంత్రికి వినతి



గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావును కలిసిన సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలోని కాచవాని సింగారం గ్రామ సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఏర్రబెల్లి దయాకర్ రావును ఆయన నివాసంలో కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. పంచాయతీలో పలు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం కొరకు దాదాపు 30 లక్షల నిధులు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధి కొరకు గ్రామ సర్పంచ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిని కలువడం ఇటీవల కాలంలో ఇది రెండోసారి కాగా నిధుల కేటాయింపుపై స్పష్టమైన హామీ లభించలేదని తెలుస్తుంది.

## చెన్నకేశవస్వామి కళ్యాణంలో పాల్గొన్న ఐక్యత చైర్మన్ సుంకిరెడ్డి



కళ్యాణంలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**మాడ్గుల, ఫిబ్రవరి03, ప్రభాతవార్త:-**
మండలంలోని ఇర్విన్ పరిదిలోని దిల్‌వార్‌ఖాన్‌పల్లిలో శ్రీ భూనీల సమేతచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయని సందర్శించారు. భక్తులతో కలసి ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలతజంగయ్యయాదవ్,ఉపసర్పంచ్ సుజాతశ్రీనివాస్, గోవర్ధన్, పగడాల ఎల్లన్న,కిరణ్, మంగయ్య, సురేష్,వెంకటేష్, భాస్కర్, శివ,రాజు, రవి,రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్లలో అభివృద్ధి అంటే ఏందో చేసి చూపించా



గోదుమకుంట గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

**కీసర, ఫిబ్రవరి3, ప్రభాతవార్తః**
గోదుమకుంట గ్రామాన్ని నాలుగేళ్లలో అభివృద్ది చేసి చూపించానని అందుకు తనకు చాలా గర్వంగా ఉందని సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణళికపై గ్రామసభను నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ పదవి కాలం ఇంకా సంవత్సర కాలం ఉందని గ్రామాన్ని జిల్లాలో ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు.2023=24 సంవత్సరానికి గాను గ్రామంలోని వివిద కాలనీలలో ఇంకా ఏమి అభివృద్ధి పనులు చేయాలని చర్చించుకున్నట్లు తెలిపారు.ఎంపిటి మంగతాయారు, ఉప సర్పంచ్ సోమని ఆంజనేయులు,ఎంపిటిసి మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్,పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి,ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, వార్డు సభ్యులు పుట్ట బాలరాజుగౌడ్,చీర శేఖర్,కురుమ రజిత శ్రీ మహేష్, సామల ప్రేమ్‌నాథ్‌రెడ్డి,తాండూరి సంధ్య దశరథ్,నాచారం పద్మ యాదగిరి గౌడ్,మంచాల స్వరూప పెంటయ్య,జంగం శివలింగం యాదవ్,కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించిన దర్శకుడు విశ్వనాథ్

**..ప్రధానోపాధ్యాయులు శాంతప్ప**



కే.విశ్వనాథ్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

**పెద్దేముల్, పిబ్రవరి 3, ప్రభాతవార్త:**
కుటుంబ సమేతంగా అందరు కలిసి చూడదగిన చిత్రాలు తీసి తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించిన దర్శకుడు కే.విశ్వనాథ్ అని ప్రదానోపాధ్యాయులు శాంతప్ప, ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి అన్నారు. తెలుగు చలన చిత్ర రంగంలో ఎన్నో సందేశాత్మక, కళాత్మక చిత్రాలకు దర్శకత్వం వహించిన కే.విశ్వనాథ్ మృతిచెందడంతో శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాంతప్ప, నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను శాస్త్రీయ సంగీతాన్ని మానవీయ విలువలను ప్రతిబింబించే విధంగా ఎన్నో చిత్రాలు నిర్మించి అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన కే.విశ్వనాథ్ అందరికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. శంకరాభరణం, సాగర సంగమం, స్వాతిముత్యం,సిరివెన్నెల, స్వయంకృషి తదితర చిత్రాలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, ప్రభాకర్, శ్రీధర్, రామలింగేశ్వర్, ప్రవీణ్‌కుమార్, రాధక్రిష్ణ,శంకర్, నిరంజన్‌రెడ్డి, మంజుల, ఆనందం కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

**కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త)ః**
కొడంగల్ పట్టణ శివారులోని బండెల ఎల్లమ్మ దేవతా ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్‌ను మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌బాబు, డాక్టర్ నవాజ్, నర్సిరెడ్డి, టి.సాయిలు తదితరులు శుక్రవారం ప్రారంభించారు. శుక్రవారం జాతర ఉత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులకు రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. అంతకు ముందు ఆలయంలో ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకులు